
# చతుర్ముఖుడు



కె. లలితా చలం

"ఇది సంభవమా !" ఎంత ఆలోచించినా సంభవమని నమ్మలేకపోగా, ఆశ్చర్యం, ఏదో అనుమానం కలిగి బ్రహ్మను బలహీనుడిని చేసేస్తున్నాయి. నమ్మశక్యం కావటంలేదు.

కాని పలికింది త్రిలోకసంచారి. సత్యవ్రతుడు పరమ భాగవతోత్తముడు. సర్వకాల సర్వావస్థలయందు నారాయణ మంత్రోచ్చారణ తప్ప వేరు ధ్యాస లేని మహర్షి. బ్రహ్మర్షి.

కృత, త్రేత, ద్వాపరయుగాల్లో ఎందరెందరో గర్వాంధులను ఓ ఆట పట్టించి, కలహాలు సృష్టించి, గర్వభంగాలు చేశాడు. కళ్ళు తెరిపించాడు. కలహభోజనుడన్న బిరుదు గడించాడు. కాని, కన్నతండ్రి జోలికి ఎన్నడూ

పోలేదు. ఈ నాడు కూడా నారదుడిని అనుమానించలేకపోతున్నాడు బ్రహ్మ.

కాని వార్త సామాన్యమైనది కాదు. గుండె దిరే వార్త, అత్యవసరంగా ఆలోచించవలసిన విషయం అయినా నిజమా? అబద్ధమా? అన్న సంశయంతో అణుమాత్రం భయం ఉత్పన్నమై మనసు కలవరపడిపోతోంది. ఆ భయం ఇంత కొంతై, కొంత అంతై, అంత అంతంతై క్షణకాలంలో విశ్వమంతై, నిలచిన చోట కాలు నిలవనియ్యటంలేదు.

కాలచక్రం ఆగిపోయి సర్వం స్థంభించి పోయినట్లు, పోతున్నట్లు భ్రమ కలుగుతోంది.

"నారదుడు చెప్పిన మాట ముమ్మాటికీ అసత్యం కానేరదు." బ్రహ్మ మనసు గట్టిగా ధృవపరిచిందింది. వెంటనే కాల చక్రం గిరుక్కున వెనక్కు తిరిగింది. వ్యాసబ్రహ్మ విశ్వామిత్రబ్రహ్మ మొదలగు బ్రహ్మర్షుల నందరినీ కనుల ముందు నిలిపింది. కల్లోల పరిచింది.

"మాటిమాటికీ నాకో ప్రత్యర్థా! బ్రహ్మ లెందరైనా, ఒక బ్రహ్మ సృష్టి కార్యకర్తగా ఉండగా, మరో సృష్టికర్త ఉండరాదన్న నియమం ఉండగా, మాటి మాటికీ ఈ విఘాతాలేమిటి? నా పదవి ఎన్నడూ శాశ్వతమైనది కాదా? నిశ్చింతగా ఉండే అవకాశమే లేదా? గతంలో ఒకసారి విశ్వామిత్రుడు బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేసెదనని పంతంపట్టి నెగ్గించుకున్నాడు. కాని దానిని పదునాల్గు లోకములవారూ విశ్వామిత్ర సృష్టిగానే చెప్పుకున్నారు తప్ప, దానికి ప్రాముఖ్యత నిచ్చి ప్రచారం చెయ్యలేదు. అదే కొండంత అండగా నిలిచి "బ్రహ్మే సృష్టి కర్త" అని నిర్ధారణ జరిగింది. కాని ఇప్పుడు మరో సృష్టికర్తా? బ్రహ్మలో అసహనం బెంగగా మారి పరిసరాల్నే భయంకరంగా చూపించసాగింది.

మాణిక్యవీణపై శారద పలికించే చతుర్వేదాల నాదం కర్ణకఠోరంగా విని పిస్తోంది. భారతి సౌందర్యం వికృతంగా కనిపిస్తోంది ఇంతకాలం తనకు గర్వ కారణమైన తనసృష్టి తననే అపహ సిస్తున్నట్లనిపిస్తోంది. ఆ అవమానం భరించలేక తన తలలే తనకు బరువై తెగిపడిపోతున్నట్లనిపిస్తోంది. తానున్నది సత్యలోకమా? అసత్యలోకమా? అన్న అనుమానం కలుగుతోంది బ్రహ్మకు.

"ఇదేమి చిత్రం? యుగాలు గడవనే లేదే? సృష్టి చేసి చేసి విసిగివేసారి అలసి, నేను బడలు విడుచుకోనలేదే! ప్రళయ సూచనలైనా లేవు! ఇవేమి జరగకుండానే, రాత్రి కాకుండానే, బ్రహ్మ నిదురించకుండానే మరో సృష్టి కర్త ఉద్భవమా? ఇదెట్లు సంభవం? నారదుడు అబద్ధమాడునా? అసంభవం అది అసంభవమైనా ఇది సంభవమే. ముమ్మాటికీ సంభవమే అయి ఉండ వచ్చును. అయినను స్వయముగా వీక్షిం

చిన అనర్థమేమున్నది? మానసిక తర్క వితర్క నిశ్చయానంతరం, విషయం తన హృదయరాణి, వాణితో కూడా చెప్పకుండా కనుమూసి తెరిచేలోపల తలచిన చోట నిలచాడు బ్రహ్మ.

* * *

అది ఒక సుందర ప్రదేశం. ఆ ప్రదేశంలో ఒక పర్ణశాల. పర్ణశాల ముందర ఒక స్త్రీమూర్తి సలక్షణంగా ముగ్గులు తీర్చిదిద్దుతోంది. ఆమె ప్రక్కనే కూర్చుని ఆమె దిద్దుతున్న ముగ్గుల్ని తదేకంగా చూస్తున్నాడు ఒక పసివాడు.

వారికి కొంత దూరంలో నిలచి ఆమెను పరిశీలనగా చూశాడు బ్రహ్మ.

ఆమె పసిడిబంగారు ఛాయలో మెరిసిపోతున్నా, ఒంటిమీద బంగారంఛాయకైనా కనుపించటంలేదు. చంద్రబింబం లాంటి ముఖం. సూర్యబింబంలా మెరిసే రక్తవర్ణసింధూరం, ఆమె సౌభాగ్య చిహ్నంగా, భ్రుకుటి మధ్య దర్శనమిచ్చింది. మల్లెలాంటి తెల్లని చీరలో, ఆమె అపర సరస్వతిలాగా కనుపించింది బ్రహ్మకు. ఆమెను పలకరించటం ఎలా? అన్న సమస్యతో సతమతమౌతున్న బ్రహ్మను ఆ పసివాడు చూసి, "అమ్మా తాత" అన్నాడు ముద్దుగా. ఆమె ఒక్కమారు తలఎత్తి చూసింది. పండుముసలి, మహాతేజస్సుతో వెలిగిపోతున్న అతని ముఖాన చతుర్వేదాల్లా విబూది రేఖలు, రేఖల మధ్యగా గంధంపైన కుంకుమబొట్టు కనిపించాయి. ఆ రూపంలో ఆమెకు త్రిమూర్తులు దర్శనమిచ్చినట్లనిపించింది. గౌరవ పురస్సరంగా ఆమె లేచి నిలబడింది ఒద్దికగా.

బ్రహ్మ ఆ పసివాడివైపు చేతులు చాచి "రారా మనవడా!" అన్నాడు. ఆ పసివాడు ముసిముసిగా నవ్వుకుంటూ ముద్దుగా నడచి బ్రహ్మదగ్గిర కెళ్ళాడు. బ్రహ్మ ఆ పసివాడిని ఎత్తుకుంటూ,

"ఏరా బాబూ, నీ పేరేమిట్రా?" అని అడిగాడు.

"బ్రహ్మర్షి" ముద్దుముద్దుగా పలికినా స్వచ్ఛంగా చెప్పాడు ఆ పసివాడు.

"అలాగా! మరి మీ నాన్న పేరేమిట్రా కన్నా?" అని అడిగాడు బ్రహ్మ.

"చెప్తా ఉండు తాతయ్యా చ, త, తకు కొమ్మిస్తే "తు", చతు "ర", రకు కొమ్మిస్తే "రు", రు కింద "మ" వత్తు యిస్తే "ర్ము" చతుర్ము, "ఖ", ఖ కు కొమ్మిస్తే "ఖు" డకార ఉకార "డు" అంటే "చతుర్ముఖుడు" అంటూ వర్ణక్రమంతోసహా పేరు చెప్పి "అంతేకద అమ్మా?" అంటూ తల్లిని ప్రశ్నించాడు ఆ పసివాడు. తల్లి చిరునవ్వు నవ్వుతూ ఆప్యాయంగా బిడ్డవంక చూసింది 'ఔ' నన్నట్లు తల ఊపుతూ.

ఆ పేరు వినగానే బ్రహ్మ కొద్దిగా

ఊరికిపడి, పైకి తన తొట్రుపాటు కనపడనీయకుండా,

"భేష్! మరి అమ్మ పేరో?" ఆ సందేహం కూడా తీరితే బెంగ ఉండదన్నట్లుగా అడిగాడు బ్రహ్మ.

"వాణి" అన్నాడు.

'తండ్రి చతుర్ముఖుడు, తల్లి వాణి తనయుడు బ్రహ్మర్షి.' బ్రహ్మ మనసులో ముల్లుగుచ్చుకున్నట్లైంది. కాని నవ్వు ముఖాన పులుముకుని "ఔనవడా! నాన్ననోమాటు పిలుచుకు రమ్మా" అంటూ పిల్లవాడిని కిందకు దించాడు బ్రహ్మ. దానికి సమాధానంగా "క్షమించండి. వారు ఇప్పుడు సృష్టి కార్యంలో నిమగ్నులై ఉన్నారు. ఇప్పుడు పలకరిస్తే బ్రహ్మలాగా తానూ అవకతవకలు సృష్టిచేయవలసి వస్తుందని విసుక్కుంటారు. అందుకని మీరు కాస్సేపు అలా కూర్చుని విశ్రాంతి తీసుకోండి. వారేవస్తారు" అంటూ ఆసనం చూపించి లోపలికి వెళ్ళిపోయిందామె. తన సృష్టికే వంకలుపెట్టే ఆ ధైర్యం, శక్తి గల చతుర్ముఖుడెవరో! ఎలా ఉంటాడో! అని ఆలోచిస్తూ కూర్చున్నాడు బ్రహ్మ.

అంతలో "నమస్కారం" అంటూ ఓ నమ్రతాపుష్పబాణం ఒకటి వచ్చి తగిలింది బ్రహ్మకు. ఆ మాట వినగానే అప్రయత్నంగానే "చిరంజీవ" అని తల తిప్పి చూశాడు బ్రహ్మ. భక్తి, వినయ, శాంత, తేజోమూర్తి కనులకు గోచరించింది. ఆశీర్వాదం అందుకున్నట్లుగా చిరునవ్వుతో తలవంచి సంతోషం ప్రకటించాడు అతడు. అతడే చతుర్ముఖుడై ఉండవచ్చునని అనిపించినా, "నీ పేరేమిటి నాయనా?" అని అడిగాడు నిర్ధారణకోసం.

"చతుర్ముఖుడు. మీపేరు తెలుసుకునే భాగ్యాన్ని కలిగిస్తారా?" అని ఎంతో వినయంగా ప్రశ్నించాడు చతుర్ముఖుడు.

"విరించి" కాస్త గర్వంగా చెప్పాడు బ్రహ్మ. చతుర్ముఖుడు తన పేరు వినగానే సాష్టాంగదండప్రణామంబులు చేసి పూజిస్తాడనుకున్నాడు బ్రహ్మ. కాని దానికి విరుద్ధంగా బ్రహ్మ కూచున్న ఆసనం పక్కనే తనూ వచ్చి కూచుంటూ,

"తమదే ఊరు?" అని అడిగాడు.

"సత్యలోకం" అన్నాడు బ్రహ్మ. తనని ఈ మాటు తప్పక గుర్తుపట్టి అదిరిపోతాడనుకున్నాడు. కాని, అసలు ఆ సమాధానానికో ప్రాముఖ్యతే ఇచ్చినట్లు కనపడలేదు చతుర్ముఖుడు. పైగా

"ఇంతకీ తమకు మా వలన కాగల కార్యం ఏమిటో శలవిస్తారా?" అని అడిగాడు కాలయాపన ఎందుకన్నట్లుగా.

చతుర్ముఖుడి ప్రశ్న వినగానే బ్రహ్మకు నవ్వొచ్చింది.

'నేనెవరనుకుంటున్నాడో ఏమిటో! ఇతగాడితో నాకు పనా? ఏం అహం! ఎంత గర్వం! పాపం ఇతగాడ్ని ఎవరూ

గౌరవించటం లేదల్లేఉంది. వెర్రివాడు బహువచన ప్రయోగంతో తనని తానే గౌరవించుకుంటున్నాడు' అనుకుని మనసులో నవ్వుకుని, పైకి మాత్రం,

"అబ్బే! నాకు పెద్ద పనేంలేదు నాయనా! నిన్ను గురించి మావాడు మహా గొప్పగా చెపుతాడు. అందుకని ఓ మారు చూసి పోదామని వచ్చాను. ఇంతకీ నువ్వేంపని చేస్తుంటావ్ నాయనా?" అని అడిగాడు బ్రహ్మ... చతుర్ముఖుడిని మీరు అనబుద్ధి కాలేదు బ్రహ్మకు.

పండుముసలి తనను ఏకవచన ప్రయోగం చేసినందుకు చతుర్ముఖుడికి కోపం రాకపోగా, చిన్నగా నవ్వుతూ,

"ఏముందీ! ఆ బ్రహ్మ పగలంతా సృష్టిచేసి, రాత్రుతైనా నిదురిస్తాడు. కాని మేము క్షణం ఏమరక అహోరాత్రులూ సృష్టిచేస్తూనే ఉంటాం" అన్నాడు చతుర్ముఖుడు.

పేరు చతుర్ముఖుడు. చేసేది సృష్టి కార్యం. విషయం నవ్వుపుట్టించేదైనా మనసులో కూడా నవ్వుకోలేకపోయాడు బ్రహ్మ. నారదుడు చెప్పిన మాట నిజమేననిపించింది ఒక క్షణం.

"సృష్టా?" అన్నాడు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"క్షమించండి. మీకు బొత్తిగా దేవభాషా పరిజ్ఞానం లేదని తెలియక ఆ పదం వాడాము. దాని అర్థం మీకు తెలిసేలాగున చెప్పిన మీ సంశయం నివృత్తి గావించటం మా కర్తవ్యం" అన్నాడు చతుర్ముఖుడు గంభీరంగా. తనని అంత చులకనగా అంచనా కట్టినందుకు చిన్నతనం కలిగి, లోలోపల బాధగా అనిపించినా, పైకిమాత్రం ఏమీ అనలేదు బ్రహ్మ. "పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమస్త విశ్వాన్ని పుట్టించింది మేము. త్రిమూర్తుల్ని సైతం పెంచి పోషిస్తున్నది మేము...." తన్మయుడై చెప్పుకుపోతున్న చతుర్ముఖుడి మాటలు వింటుంటే బ్రహ్మకు ఏదో అనుమానం కలిగింది. చతుర్ముఖుడిని ఆపాదమస్తకం ఒక్కసారి పరికించి చూశాడు.

మహాతేజస్సుతో విరాజిల్లుతున్న ముఖం. మిలమిలలాడుతూ కాంతులు వెదజల్లే కన్నులు. అతని చూపుల్లో, ముఖంలో, చేష్టల్లో, రవంత తొట్రుపాటుగానీ, అసభ్య ప్రవర్తనగానీ, వెకిలితనంగానీ కనిపించలేదు. చతుర్ముఖుని ఊహమాత్రంగా కూడా పిచ్చివాన్నిగా అంచనాకట్టలేకపోయాడు బ్రహ్మ. అలా ఊహించటం తన పిచ్చితనానికి నిదర్శనంగా అనిపించింది ఓ క్షణం.

కాకపోతే మరో సృష్టికర్త ఉన్నాడని నారదుడు చెప్పగానే నమ్మి వెర్రివానిలాగా నేను పరిగెత్తుకు రావడమేమిటి? ఇంకా నయం. ఈ విషయం మరెవరికీ తెలియదు. లేకుంటే నవ్వులపాలు కాకమానుదునా? అని అనిపించింది. మరుక్షణం చతుర్ముఖుడి మాటలు

వ్యర్థపు మాటలని కొట్టిపారెయ్యలేక పోతున్నాడు బ్రహ్మ. అందుకే మరి కొన్ని ప్రశ్నలడిగితే మంచిదని నిశ్చయించుకున్నాడు.

"సమస్త సృష్టికారకుడూ బ్రహ్మ కదా. సృష్టికర్త నువ్వెలా అవుతావు? లేక నువు వ్యాస, విశ్వామిత్రాది బ్రహ్మర్షులలో ఒకడివా?" తన మనసులో వేధిస్తున్న అనుమానాన్ని పైకి నవ్వుతూ వెలికికక్కాడు బ్రహ్మ. బ్రహ్మ మాటలకు చతుర్ముఖుడు ఒక్కసారిగా నవ్వి, "తమరు వయసులో పెద్దవారే అయినా మీకు చాలా విషయాలు తెలియవల్లే ఉంది. ఆ బ్రహ్మ కేవలం చరాచర జీవజాలాన్నే సృష్టించాడు. తాను స్వయంభువు ననుకుంటున్నాడు. కాని ఆ బ్రహ్మని, బ్రహ్మర్షులని కూడా సృష్టించింది మేమే కదండీ!" అన్నాడు చతుర్ముఖుడు. చతుర్ముఖుని మాటలు విని అవాక్కైపోయాడు బ్రహ్మ. తనంతవాడిని ఒక చేతకానివాడిగా, వెర్రివాడిగా జమకట్టగలిగిన చతుర్ముఖుడు సామాన్యుడు కాడేమో ననిపించింది. అసాధ్యుడు, అతి ధైర్య, సాహస వాక్చతురుడనిపించింది.

'లేకున్న ఇంతవరకూ దేవ, గరుడ, గంధర్వ, కిన్నెర, కింపురుష ఋషిసత్తమ, దైత్య, వరమదాంధులు కూడా తెగించి ఇంత ధైర్యంగా పలికి ఉండలేదు. ఇతడెవరై ఉండును?' అన్న ప్రశ్న భయంకర రూపుదాల్చి బ్రహ్మలో గల ధైర్యాన్ని అణగార్చసాగింది. చతుర్ముఖుని పలుకులు మృదుమధురమై వినసొంపుగా కుతూహలము కల్గించుచున్ననూ, బ్రహ్మను భయకంపితుడ్ని చేస్తున్నాయి.

'ఇంతటి మేధాశాలి తల్లి దండ్రులెవరో? ఈతని పుట్టుపూర్వోత్తరములేమిటో తెలుసుకొనుట తనకు తప్పని సరి' అనిపించింది. పైకి అతి సంతోషం నటిస్తూ,

"నీ అంతటి మేధావికి జన్మనిచ్చిన నీ తల్లితండ్రుల నామధేయములు తెలిపి నన్ను సంతోషపరుచు నాయనా" అన్నాడు. "అవశ్యం, మా తల్లి తండ్రుల పేర్లు పలుమార్లు తలపోయుట మాకూ గర్వకారణమే. మేము ఆదిలక్ష్మీనారాయణుల ముద్దుబిడ్డలం", అంటూ చేతులెత్తి భక్తితో మనసారా నమస్కరించాడు చతుర్ముఖుడు. ఆ పేర్లు వినగానే అదిరిపోయాడు బ్రహ్మ.

ఏమీ! నా తలితండ్రులే ఇతని తల్లితండ్రులా? అదెట్లు? ఏమో! జగన్నాటక సూత్రధారి, లీలామానుష వేషధారి. నాకో ప్రత్యర్థిని సృష్టించి నాటకమాడుట లేదుకదా! అతని లీలలు తెలుసుకొన విధాతకైన తరమే? అని నారదుడు పదేపదే కీర్తిస్తూనే ఉంటాడు. అది ముమ్మాటికీ నిజము. కాకున్న ఇతని మాటలలో ఇంత దర్పముండునా?

నదురు బెదురు కానరాదే!" విరించి మనసు పరిపరి విధముల శంకించి పీడింప సాగింది. కాని మరికొంత విచారించిన గానీ నమ్మరాదనిపి చింది. "ధన్యులు, అయితే సృష్టి, స్థితి, లయాలు నీ చెప్పు చేతల్లోనే ఉన్నాయంటావా బాబూ?" అని ప్రశ్నించి, సమాధానం ఏమి రానున్నదో అని చెవులు రిక్కించుకుని వినసాగాడు బ్రహ్మ.

"ఇంకా మీకు సందేహమా! నిస్సందేహంగా మా చేతుల్లోనే ఉన్నాయి. మేము తలచుకుంటే మేము సృష్టించిన ప్రతిదానినీ హుళక్కి చేయగలం. ముక్కోటి దేవతల్నీ, అష్టదిక్పాలకు లనీ, నవగ్రహాలను, త్రిమూర్తులను సైతం క్షణంలో నామరూపాలు లేకుండా చెయ్యగలం." అన్నాడు చతుర్ముఖుడు ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ.

"అంటే....నిక్కచి గా నువు వర ప్రసాదివే! కాని మరొక్క సందేహం. అడిగితే ఏమనకోవు కదా?" రగిలి పోతున్న మనసుని ఉగ్గపట్టుకుని అడి గాడు బ్రహ్మ.

"తెలియక మీరు అడగటం! మేము అనుకోటమూనా! ఎంతమాట. అడ గండి" అన్నాడు చతుర్ముఖుడు.

"మరేంలేదు. మీకు... చా... వు..." అడిగితే బాగుండని ప్రశ్న అది. అర్థోక్తి లోనే ఆగిపోయాడు బ్రహ్మ.

చతుర్ముఖుడు ఫక్కున నవ్వి "మీరు ఇందాక దీవించినట్లుగా చిరంజీవులం మేము. మాకు పుట్టుకే తప్ప చావులేదు. రాదు." అన్నాడు దృఢంగా.

'అంటే ఇతగాడు చిరంజీవన్నమాట. ఎంత మోసం! ఎంత మోసం! సందే హం లేదు. ఇతగాడు నిక్కచ్చిగా ఆ శ్రీమన్నారాయణుడిపుత్రుడేఅనిపిస్తోంది. ఆ శ్రీహరినే అడిగి తేల్చుకోవాలి. ఇక ముందు నేనెవరో! నా స్థానమేమిటో!' మనసులో దుఃఖం పొర్లుకొచ్చింది. కాని దానిని అణగదొక్కుకుని, "చాలా సంతోషం. కాలయాపన నాకు, నీకు కూడా అనర్థమే! మళ్ళీ వస్తాలే" అంటూ సరాసరి విష్ణులోకానికి పరుగుతీశాడు బ్రహ్మ.

విష్ణుమూర్తి పాలకడలిలో శేష తల్పాన శయనించి ఉన్నాడు. "తండ్రీ! ఆర్తత్రాణపరాయణా! ఆశ్రితరక్షకా! పాహిమాం! పాహిమాం" అంటూ విల పిస్తూ విష్ణుమూర్తి పాదాలమీద వాలి పోయాడు బ్రహ్మ. బ్రహ్మ అకాల ఆగమన దుఃఖకారణం తెలియక విస్తు పోయాడు శ్రీహరి.

"నాయనా! కుమారా! నీ అకాల ఆగమన కారణమేమి? ఎందులకా కల వరం? నీకు సంభవించిన విపత్తు ఏమిటి నాయనా?" అంటూ ఆదరణగా పుత్రుని పలకరించాడు నారాయణుడు.

సర్వాంతర్యామి, సకలలోకపాలకుడు అయిన శ్రీహరికి తన ఆగమన కారణం

తెలియదనుకునేంత అజ్ఞాని కాదు బ్రహ్మ. కాని కార్యార్థి. విషయం విన్నవించుకోడం ధర్మం అని యోచించి, "తండ్రీ! ఇంతకాలం నేను బ్రహ్మననీ, సృష్టి నా కర్తవ్యమనీ సృష్టికర్తను నేనేననీ, త్రిమూర్తులలో ప్రప్రథమస్థానం నాదేననీ, చతుర్వేదోద్భవం నా ముఖతానే జరిగిందనీ, ఎన్నెన్నో వెర్రివాదనై తలపోసేవాడిని. కాని.... ఏదో ఒక రోజున కన్నతండ్రి కంటికే నలుసై పోతానని ఎన్నడూ ఊహించనైనా ఊహించలేదు. కాని ఎందుకో ఈనాడు అలాంటి ఊహాతీతమైన అనుమానం నన్ను ఆవరించి కలవరపెడుతోంది. అది కేవలం ఊహేననీ, కల్ల అనీ నీ ముఖతావిని ఊరడిల్లాలని ఇలా వచ్చాను తండ్రీ!" అంటూ తన మనసులోని బాధంతా అందీఅందకుండా అందిచ్చాడు బ్రహ్మ.

బ్రహ్మ మాటల గూఢార్థం, సారాంశం అర్థంకానట్లుగా, "విరించీ! లేనిపోని అనుమానాలు పోగుచేసుకుని, కలవరపడి మనసు పాడుచేసుకోకు. అసలు విషయం విశదీకరించు. అవసరమైతే ఆదుకోటానికి నేనున్నానుగా!" అంటూ ఊరట మాటలు పలికి అభయమిచ్చాడు శ్రీపతి. కాని శ్రీహరి శాంతవచనాలకు ఊరడిల్లలేక, పొంగివస్తున్న దుఃఖాన్ని అణచుకుంటూ, "తండ్రీ! యుగయుగాలు గడవకుండానే నా ఆయుఃపరిమితి తీరిపోయెనా? ప్రళయం సంభవించకుండానే రాత్రి అయెనా? ప్రళయానంతరము మేల్కాంచి సృష్టి ప్రారంభించుట కదా బ్రహ్మ కర్తవ్యము. మరి పగటి పూటే చుక్కపొడుపు సాధ్యమా? తండ్రీ! నా సందేహము తీర్చి నన్ను కరుణించు లోకపాలా!" అంటూ విష్ణుమూర్తిని ప్రార్థించాడు బ్రహ్మ.

"అంటే! మరో సృష్టికర్త ఉద్భవించాడా విరించీ!" తల పంకించి ప్రశ్నించాడు శ్రీహరి.

"అవును స్వామీ! వాడు నాలాగే బహునామధేయుడు. చతుర్ముఖుడట. శతకోటి సూక్ష్మచక్షుడట. తన తల్లి తండ్రులు మీరేననీ, తాను సృష్టికర్తననీ సృష్టికి మూలాధారుడూ, కారణభూతుడూ తానేననీ చెప్తున్నాడు. పైగా చతుర్వేదాలూ తానే సృష్టించానని ప్రగల్భాలు పలుకుతున్నాడు" ఆవేశంతో అన్నాడు బ్రహ్మ.

శ్రీహరి కాస్త ఆలోచించి, "వాడు తపసుచేసి ఏవైనా వరాలు పొందిన వాడా!" అని అడిగాడు.

"కాదు తండ్రీ! కాని వాడికి ఎన్నెన్నో దివ్యశక్తులున్నాయట. విశ్వాన్నంతా సృష్టించడమేకాక త్రిమూర్తులని కూడా పుట్టించి పోషిస్తున్నాడట. తనకు ఆగ్రహం కలిగితే క్షణకాలంలో ముక్కోటి దేవతల్నీ నామరూపాలు లేకుండా నాశనం చెయ్యగలనని ధీమాగా

పలికాడు స్వామీ!" అన్నాడు బ్రహ్మ బేలగా.

"అలాగా! అయితే వాడివద్ద మారణాయుధాలేమైనా ఉన్నాయా?" సందేహిస్తూ ప్రశ్నించాడు శ్రీహరి. శ్రీహరి ఇన్ని ప్రశ్నలేస్తుంటే అతనికేమీ తెలియదేమోనని అనుమానం కలిగింది బ్రహ్మకు.

"అబ్బే. అలాంటి ఆయుధాలేమీ లేవు" అన్న బ్రహ్మ మాటలకు శ్రీహరి నవ్వి "అయితే! తాటాకు చప్పుళ్ళకే బెదిరి పారిపోవడానికి నువ్వేమైనా ఇంద్రుడివా విరించీ?" అన్నాడు.

"ఏమిటో తండ్రీ! నాకేదో భయంగా ఉంది. వాడి వాగ్దాటికి తాళలేక మీ శరణు జొచ్చిన దీనుణ్ని. ఒక్కమాటు మీరు వాడిమాటలు వింటే, నా భయాందోళనలకు కారణం మీకే అర్థమౌతుంది. జగన్నాటక లీలావినోదీ! ఆ వాచాలుడిని హతమార్చి నన్ను కాపాడవా దీనబాంధవా." అంటూ పరిపరివిధాల ప్రార్థించాడు బ్రహ్మ. శ్రీహరికి బ్రహ్మ పరిస్థితి చూసి జాలేసింది. తన దివ్య నేత్రంతో చతుర్ముఖుడిని చూశాడు శ్రీహరి.

బ్రహ్మను జాలిగా చూస్తూ, "విరించీ! అతడు చెప్పినదంతా అక్షరాలా సత్యం. అతడు చెప్పినది చెయ్యగల సమర్థుడు, అతని వల్లనే ఉద్భవించి, అతని అలన పాలనలోనే నేను పెరుగుతున్న మాట వాస్తవం. నా దశావతార కారకుడూ వేదోద్ధారకుడూ కూడా అతడే. అతనికి నేను తండ్రినైతే అతడు నాకు తండ్రిలాంటి వాడు. నేను అతనికి ఏమీ చెయ్యలేను." అన్నాడు శ్రీహరి.

సర్వప్రాణులను కాపాడు ఆ శ్రీపతే తాను అసమర్థుడనని వెల్లడిచేస్తుంటే దిక్కు తోచక, విక్కముఖుడై పోయాడు బ్రహ్మ.

"అయితే తండ్రీ! ఇంతకాలం నేను చేసిన సృష్టి ఏమైంది?" దుఃఖం ఆపుకోలేక ప్రశ్నించాడు బ్రహ్మ.

"చతుర్ముఖుడి సృష్టిలో లీనమైపోయింది. విధాతకైనా విధి వ్రాత ఉంటుంది విరించీ! దానిని తప్పించుట ఎవరికీ శక్యము కానిది. ఆ చతుర్ముఖుడిని శరణు వేడితే సత్ఫలితం దక్కవచ్చు". ఒక ఉచిత సలహా ఇచ్చి మిన్నకఊరకున్నాడు లక్ష్మీవల్లభుడు.

కాని విరించికి ఆ సలహా రుచించలేదు. తండ్రి ఎదుట తప్పు పలుకలేని విరించి శక్తిహీనుడైపోతున్నా ధైర్యం కూడగట్టుకుని ఆలోచించాడు. భస్మాసురుడిని భస్మంచేసినట్లు, చతుర్ముఖుడిని కూడా ఉపాయంతో శక్తిహీనుణ్నిచేసి పరిమార్చాలన్న పట్టుదలతో, చతుర్ముఖుడి దగ్గరకు బయలు దేరాడు బ్రహ్మ.

* * *

పూర్వ పరిచయాన్ని పురస్కరించుకుని చతుర్ముఖుడు ఎంతో ఆదరంతో బ్రహ్మను ఆహ్వానించాడు. కుశల ప్రశ్నలు వేశాడు. కాని చతుర్ముఖుడి

ఆతిథ్యం, ఆదరణ బ్రహ్మ మనసులో మంటలు రేపాయి. పైకి ప్రశాంతంగా ఉండాలని విశ్వప్రయత్నంచేసి విఫలు డౌతున్నాడు. బ్రహ్మ ఏదో తీరని వ్యథతో బాధపడుతున్నట్లు, ముఖకవళి కల్నిబట్టి గ్రహించాడు చతుర్ముఖుడు.

"విరించిగారూ! ఏమిటలా ఉన్నారు?" అని అడిగాడు.

"ఏం చెప్పను? పరిష్కరించలేని సమస్యలు. సమాధానపడలేని ప్రశ్నలతో సతమతమౌతున్నాను." అన్నాడు బ్రహ్మ నిట్టూరుస్తూ.

"సమస్య వచ్చినపుడే సందేహాలు ఉత్పన్నమౌతాయి. సందేహమే ప్రశ్నల నిలయం. ప్రతి ప్రశ్నకూ సమాధానం ఉంటుంది. లేకుంటే సమాధాన పరచుకోడం తప్పనిసరి. సమాధాన పడితే, గాని తృప్తి కలుగదు మరి. మీరేమీ అనుకోకపోతే మీ సమస్యలు ప్రశ్నలూ మాకొక్కడా చెప్పండి చేతనైతే పరిష్కరించి మీకు శాంతిని కలుగచేస్తా" అన్నాడు చతుర్ముఖుడు.

"మరేంలేదు. బ్రహ్మ సృష్టిలో ఏవో లోపాలు, అవకతవకలు ఉన్నాయన్నారు కదా! అవేమిటో కాస్త వివరంగా చెప్పు నాయనా?" లోలోపల ఉడికిపోతున్నా పైకి మాత్రం ప్రశాంతత నటిస్తూ అడిగాడు బ్రహ్మ.

చతుర్ముఖుడు తేలిగ్గా నవ్వుతూ "అదా మీ సమస్య. మరేమిటో అనుకున్నాను. ఆ లోపాలు మేమే ఎత్తి చెప్పే అవసరం లేదు విరించిగారూ! ఒక్కసారి దృష్టి సారించి విశ్వాన్ని పరిశీలిస్తే అందరికీ కనిపిస్తాయి ఆ అవకతవకలు. బ్రహ్మ సృష్టి ఒక సృష్టేనా! అడిగారుకనక చెప్తా వినండి. తెలుపు నలుపు వర్ణబేధం పెట్టాడు. రక్తపాతాలకు దారితీయించాడు. గొప్ప బీద, హెచ్చుతగ్గులు ఏర్పరచాడు. సాటి ప్రాణిపై చులకన భావాన్నీ బానిస మనస్తత్వాన్నీ రేకెత్తించాడు. అంగవైకల్యాలు సృష్టించాడు. ఎత్తి కనిపించేటట్లు, చిన్నబుచ్చుకునేటట్లు చేశాడు. ఇలాంటివే ఎన్నో, ఎన్నెన్నో, మచ్చుకివి చాలవా విరించిగారూ," చతుర్ముఖుడు ఆవేశంతో చెప్పుకుపోతుంటే బ్రహ్మకు కూడా అవన్నీ తన సృష్టిలో లోపాలుగానే కనిపించాయి. మనసులో లజ్జగా అనిపించింది. కాని కాస్తతమాయించుకుని, "అయితే నీ సృష్టిలో అలాంటి లోపాలు ఉండవంటావా?" అని అడిగాడు నీరసంగా.

"ఉండవు! ముమ్మాటికీ ఉండవు. మా సృష్టి విశ్వ కళ్యాణానికే కాని నాశనానికి కాదు." అన్నాడు చతుర్ముఖుడు గర్వంగా, దృఢంగా. బ్రహ్మలో మానస ప్రళయం ప్రారంభమై చీకట్లు కమ్ముతున్నట్లైంది. తన సృష్టిలోనే లోపాలు ఎంచి, ఎత్తిచూపగలుగుతున్నాడంటే అతను సామాన్యుడు కాదనిపిం

చింది. అతనిలో ఏదో మహత్తర శక్తి ఉందనిపించింది బ్రహ్మకు. ఆ శక్తి ఏదో! ఎక్కడిదో! దాని ఆయువుపట్టు కనిపెట్టి శుక్రచార్యుడి కన్ను పొడినట్లు చతుర్ముఖుడిని నాశనంచెయ్యాలనిపించింది బ్రహ్మకు.

"నీలో ఏదో అఖండ శక్తి ఉంది. ఆ శక్తి నీకెలా లభ్యమైందో ?..." జిత్తుల మాటలతో పలికాడు బ్రహ్మ.

"అది నా పూర్వజన్మ తపఃఫలం. ఈ జన్మ సుకృతంగా పొందగలనని నా శారద నాకిచ్చిన ముచ్చటైన ముద్దుల వరం " తన్మయుడై భక్తివినయాలతో నమస్కరించాడు చతుర్ముఖుడు.

'నా శారద' అన్న పదం వినగానే అదిరిపడ్డాడు బ్రహ్మ. తన శారద తనకే ద్రోహంచేసిందన్న కోపం మంటలు రేపింది. తమాయించుకోలేక,

"ఓరీ! వాచాలా! చాలించు నీ వాచాలత. శారదనీ .. శా ర... దా." అంటూ ఉద్రేకంతో దిక్కులుపిక్కటిల్లేటట్లు గర్జించాడు బ్రహ్మ.

ఆ అరుపుకు చతుర్ముఖుడు ఒక్కసారి అదిరిపడి, మరుక్షణమే తేరుకుని,

"ఓరీ! మాయా వేషధారి; ఎవరు నువ్వు ?" బ్రహ్మని ఆపాదమస్తకం నిశితంగా పరిశీలిస్తూ అడిగాడు చతుర్ముఖుడు. బ్రహ్మ విరగబడి నవ్వి! "ఓరీ! సర్వసృష్టికర్తని నేనేనని విర్రవీగుతున్న నీకు, నేనెవరో తెలియదా? అయితే నువు సృష్టికర్తవు కావు. కానేరవు. నేనెవరో తెలుసుకుంటే నీ వాక్కు బంధించిపోతుంది. గుండె అదిరిపోతుంది. సర్వావయవాలూ చైతన్యహీనమై పోగలవు.

"నేను కమలాసనుడను. సత్యలోకవాసిని. బ్రహ్మను. సృష్టికర్తను. శారదా వ.... ల్ల.... భు - డను." ఒక్కొక్క మాటే ఒత్తి పలుకుతూ చతుర్ముఖుని ముఖంలో కలిగే మార్పుల కోసం ఎదురుచూశాడు బ్రహ్మ.

చతుర్ముఖుని ముఖంలో ఏ మార్పూ లేకపోగా తననే ఆపాదమస్తకం పరిశీలిస్తున్న చతుర్ముఖుడిని చూస్తుంటే బ్రహ్మకు చిర్రెత్తుకొచ్చింది.

"ఓరీ! ఇప్పు' చెప్పు, నువ్వెవరవు?" అన్నాడు ఉ ంగా.

చతుర్ముఖుడు ఫక్కున నవ్వి, "విరించీ! నమోనమః. నీవు బ్రహ్మవనీ సృష్టికర్తవనీ చెపుతూనే నేనెవరో గుర్తించలేకపోతున్నావంటే 'విధి విలాసం' అంటారు దీన్నే కాబోలు" అన్నాడు చతుర్ముఖుడు జాలిగా చూస్తూ.

ఆ మాటలు విద్యుద్ఘాతంలా తగిలాయి బ్రహ్మకు. ఎంత ఆలోచించినా చతుర్ముఖుడెవరో తెలుసుకోలేకపోతున్నాడు. బ్రహ్మ దునివస్త గ్రహించి, "సృష్టికర్తా! బ్రహ్మ! నేను క....వి.ని" అన్నాడు చతుర్ముఖుడు నవ్వుతూ.

ఆ మాట వినగానే అదిరిపోయాడు

బ్రహ్మ. అప్రయత్నంగా, "ఓరి దరిద్రుడా! నువ్వా?" అన్నాడు ఉగ్రుడై పోతూ.

"శాంతించు విధాతా! శాంతించు. నీ వాక్కు అమోఘం. అనన్యం. నీ వ్రాతలు చెరపరానివి. మా నుదుట నువ్వు దరిద్రం వ్రాసి చిన్నచూపు చూస్తే, మేమూ నీ నుదుట పూజార్హత తుడిపేశాం. కావాలంటే చూసుకో" అంటూ జాలిని గొలిపే నవ్వు నవ్వాడు కవి.

ఆ మాట విని నిజమౌనో! కాదో! నని విశ్వమంతా ఒక్కమాటు కలయ జూశాడు బ్రహ్మ.

ఎక్కడ చూసినా వేదఘోషలు, జేగంటలు, పూజలు, సేవలు, నైవేద్యాలు అందుకుంటూ శంకర, నారాయణులతో పాటు సమస్త దేవగణం కనిపించారు.

బ్రహ్మ ముఖం చిన్నబోయింది.

"చూశావా సృష్టికర్తా! నీ పక్షపాత బుద్ధి మమ్మల్ని హీనుల్ని దీనుల్ని చేస్తే మా తల్లి వాణి కరుణించి మమ్మలి అనుగ్రహించింది. లేకుంటే త్రిమూర్తులూ మాచే పూజలందుకునేవారు. ఇకనైనా మా నుదుట సిరి వ్రాయి. పూజలందుకో విరించీ!" అంటూ నమస్కరించాడు చతుర్ముఖుడనే కవిబ్రహ్మ.

